## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక

సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 81 బుధవారం జూలై 22 2026, పేజీలు - 4 వెల :2/-


## హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి

### ప్రతి నెలా పురోగతిని స్వయంగా సమీక్షిస్తా.. అవసరమైతే సైట్‌లోనే బస చేస్తా



హిందుస్థాన్ మీడియా

వికారాబాద్ జిల్లా హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని, అవసరమైతే ఒక రోజు సైట్‌లోనే బస చేసి పనులను సమీక్షిస్తానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ, పారా మెడికల్ కళాశాలల భవన నిర్మాణాలతో పాటు విద్యార్థుల హాస్టళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాల నాణ్యత, ప్రణాళికల అమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన నెలవారీ పురోగతి నివేదికలను తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించిన ముఖ్యమంత్రి, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయడానికైనా వెనుకాడవద్దని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. అదే విధంగా ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన



రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా అర్హులైన లబ్ధిదారులకు ప్లాట్ల పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎడ్యుకేషన్ హబ్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

## విద్యార్థులపై పోలీసు చర్యలను ఖండించిన కేటీఆర్

'-సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు'..
- కాక్రోచ్ పార్టీ ర్యాలీకి కేటీఆర్ మద్దతు
-ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉందని వ్యాఖ్య
-విభేదాల గొంతు నొక్కే ప్రయత్నం ఆపాలంటూ కేంద్రానికి చురకలు
-విద్యార్థులకు సంఘీభావం ప్రకటించిన బీఆర్ఎస్ నేత
-ఈ ప్రతిఘటనను పది నెలల క్రితమే ఊహించినట్లు వెల్లడి

హిందుస్థాన్ మీడియా



నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. యువత ఆవేదనను పట్టించుకోకపోతే దేశంలో 'జెన్-జెడ్' ఉద్యమం తప్పదని తాను పదినెలల కిందటే చెప్పానని గుర్తుచేశారు. ఢిల్లీలో జరిగిన నిరసనల తర్వాతైనా కేంద్రం జవాబుదారీతనం చూపించి, విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు కల్పించిందని పేర్కొన్నారు. విభేదాల గొంతు నొక్కే ప్రయత్నాలను కేంద్రం వెంటనే ఆపాలని, జవాబుదారీతనం కోసం పోరాడుతున్న విద్యార్థులకు తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు.ఇదే అంశంపై తెలంగాణ కాంగ్రెస్ కూడా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ పాల్గొన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పొన్నం డిమాండ్ చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులకు మద్దతు ప్రకటిస్తూ, పోలీసుల చర్యలను ఖండించారు.

## ఏపీ లిక్కర్ రవాణా టెండర్ల స్కామ్‌లో ముగ్గురు నిందితులకు రిమాండ్



-లిక్కర్ స్కామ్: వాసుదేవ రెడ్డి, మాజీ మంత్రి కుమారుడికి ఆగస్టు 3 వరకు రిమాండ్
-మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి, మాజీ మంత్రి కుమారుడు సునీల్‌కు జ్యుడీషియల్ కస్టడీ
-ఆగస్టు 3 వరకు రిమాండ్ విధిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు
-రూ. 192 కోట్ల నష్టం జరిగిందని సిట్ రిమాండ్ రిపోర్ట్‌లో ఆరోపణ

హిందుస్థాన్ మీడియా

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ముగ్గురు ప్రధాన నిందితులకు విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆగస్టు 3 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (APSBCL) మాజీ మేనేజింగ్ డైరెక్టర్ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి (A1), మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ (A4), మరియు రాజ్ కసిరెడ్డి (A8)లకు కోర్టు రిమాండ్ విధించింది. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఈ ముగ్గురిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు ప్రిజనర్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్‌పై సోమవారం విజయవాడకు తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా నిందితుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. నిందితులు ఇప్పటికే ఈడీ కేసులో అరెస్ట య్యారని, వారికి 41A నోటీసులు జారీ చేయాలని కోరారు. అలాగే కుటుంబ సభ్యులను కలిసేందుకు వీలుగా వారిని చంచల్‌గూడ జైలులోనే ఉంచాలని న్యాయస్థానాన్ని అభ్యర్థిం చారు. మరోవైపు, సిట్ తరఫు ప్రాసిక్యూటర్లు తమ వాదన లను వినిపిస్తూ.. ఈ కుంభకోణంలో వాసుదేవ రెడ్డి కీలక పాత్ర పోషించారని వివరించారు. టెండర్ల నిబంధన లను ఇష్టానుసారంగా మార్చి, రేట్లను పెంచి ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం చేకూర్చారని ఆరోపించారు. మాజీ మంత్రి కుమారుడు సునీల్ తన తండ్రి పరపతిని అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని, ఈ ప్రక్రియలో రూ. 16 కోట్లు ముడుపులుగా తీసుకున్నారని రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వాట్సాప్ సంభాషణ లు , బ్యాంకు లావాదేవీల వివరాలను ఆధారాలు గా కోర్టుకు సమర్పించారు. ఉభయ పక్షాల వాదనలు విన్న న్యాయ మూర్తి, నిందితులకు ఆగస్టు 3 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితులను తిరిగి చంచల్‌గూడ జైలుకే తరలించాలని ఈ సందర్భంగా ఆదేశిం చారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్లలో జరిగిన అవకతవకల కారణంగా ప్రభుత్వానికి సుమారు రూ. 192 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సిట్ ప్రాథమికంగా నిర్ధారించింది.

## ఢిల్లీకి సీఎం చంద్రబాబు

హిందుస్థాన్ మీడియా



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు న్యూఢిల్లీ పర్యటన ఖరారైంది. బుధవారం ఉదయం 7.30 గంటలకు ఆయన గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులతో ఆయన సమావేశం కానున్నారు. ఆగస్టు 1వ తేదీన విజయ నగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీని ముఖ్య అతిథి గా సీఎం చంద్రబాబు ఆహ్వానించనున్నారు. అనంతరం కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షాతో ఆయన భేటీ అవుతారు. ఆ తర్వాత కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, సీఆర్ పాటిల్‌తోపాటు పీయూష్ గోయల్‌తో వరుసగా సమావేశం అవుతారు. బుధవారం రాత్రి ఢిల్లీలోనే సీఎం చంద్రబాబు బస చేయనున్నారు. గురువారం ఉదయం న్యూఢిల్లీ నుంచి నేరుగా గన్నవరం చేరుకుంటారు. అక్కడి నుంచి వెలగపూడి లోనిసచివాలయానికినేరుగాచేరుకుంటారు. కేంద్ర మంత్రుల తో జరిగే భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను వారి దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకెళ్లనున్నారని సమాచారం.

## మాజీ స్పీకర్ తమ్మినేనికి హైకోర్టులో షాక్

-క్వాష్ పిటిషన్ కొట్టివేత

హిందుస్థాన్ మీడియా




మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తమ్మినేని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేసింది. కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని పేర్కొన్న న్యాయస్థానం.. ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేసింది. అరెస్టు భయం ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. ఈ కేసుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ను జులై 29కి వాయిదా వేసింది.

**కేసు వివరాలు**

నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో తమ్మినేనిపై కేసు నమోదైంది. ఈ వ్యవహారం పై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయం లో కేసును రద్దు చేయాలని కోరుతూ తమ్మినేని హైకోర్టు ను ఆశ్రయించారు. అయితే కేసు ప్రాథమిక దశలో ఉన్నందున క్వాష్ చేయడానికి నిరాకరించిన హైకోర్టు.. చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించింది.

## కొమురవెల్లిలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

-పాల్గొన్న జనగామ జిల్లా అధ్యక్షుడు సౌద రమేష్





హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి మండలంలో జూలై 26న జరగనున్న కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌద రమేష్ పార్టీ ముఖ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కొమురవెల్లి మండలంలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. కేంద్ర క్యాబినెట్ మంత్రి జి. కిషన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రతి కార్యకర్త చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

## జానపద సాహిత్య పురస్కార కవి సమ్మేళనంలో వేమన శ్రీ చరణ్ సాయి దాస్‌కు సన్మానం



హిందుస్థాన్ మీడియా, సిద్దిపేట:

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు పాలడుగు నాగయ్య కళా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద సాహిత్య పురస్కార కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ కవి, శ్రీ సరస్వతీ సంసేవకుడు వేముల శ్రీ వేమన శ్రీ చరణ్ సాయి దాస్ (సిద్దిపేట)ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు కసిరెడ్డి వెంకటరెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, జె.బి. రాజు, గంటా మనోహర్ రెడ్డి, ఇంద్రవెల్లి రమేష్, చంద్రప్రకాశ్ రెడ్డి, రాధాకుసుమ తదితరులు పాల్గొని సాహిత్యం, జానపద సంస్కృతి పరిరక్షణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. పాల్గొన్న కవులు, సాహితీవేత్తలు జానపద సాహిత్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

### జల సంరక్షణ,వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి

-కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



హిందుస్థాన్ మీడియా

జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం,జల సంరక్షణ పనులు,తాగునీటి వనరుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వెంటనే సమర్పించి లక్ష్యాల సాధనకు వేగంగా చర్యలు చేపట్టాలని సూచించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వి.బి.రామ్‌జీ,స్వచ్ఛ భారత్, జలసిరి,ఎల్‌నినో పరిస్థితులు, వ్యవసాయ సంబంధిత అంశాలపై జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ వెబ్‌ఎక్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి, మరుగుదొడ్డి లేని ప్రతి అర్హ కుటుంబానికి మరుగుదొడ్డి మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ,నాన్-ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన ప్రతిపాదనలను విడివిడిగా సమర్పించాలని,మంజూరైన మరుగుదొడ్ల ఫొటోలను స్వచ్ఛ భారత్ మిషన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి నిధులు విడుదలయ్యేలా చూడాలని సూచించారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జలసిరి, తాగునీరు,జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఇంకుడు గుంతలు, బోరుబావుల పునరుద్ధరణ, ఇంటి పైకప్పులపై వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, వ్యవసాయ కుంటల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన,ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహించి వ్యవసాయ కుంటలు, బోరుబావుల పునరుద్ధరణ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పైకప్పుల వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి గ్రామ సమాఖ్య భవనానికి సామూహిక పారిశుద్ధ్య సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.అలాగే పాఠశాల మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేసి ఆమోదానికి పంపాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను తక్షణమే సమర్పించి, పర్యవేక్షణ వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని,గ్రామ పంచాయతీ తీర్మానాల కోసం వేచి చూడకుండా అవసరమైన తీర్మానాలు తీసుకుని పనుల ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అన్ని పథకాల అమలులో సమాచారం ఖచ్చితత్వం, సకాలంలో ప్రతిపాదనల సమర్పణ,చెల్లింపుల పూర్తి, క్షేత్రస్థాయి ధృవీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, లక్ష్యాలు పూర్తయ్యే వరకు ప్రతిరోజూ పర్యవేక్షణతో పాటు క్లస్టర్ వారీగా సమీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య,జడ్పీ సీఈఓ శిరీష,డీపీఓ యాదగిరి,ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గీతన్నల చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలి: బండకింది అరుణ్

-ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా యాత్ర.. ఆగస్టు 11న చేర్యాలకు రాక





హిందుస్థాన్ మీడియా, చేర్యాల:

తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన నాయకుల స్మారకార్థం నిర్వహిస్తున్న లి”అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర”లిను విజయవంతం చేయాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం (KGKS) సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ పిలుపునిచ్చారు. మహ బూబాబాద్ జిల్లా మానుకోట నుంచి ఆగస్టు 2న ప్రారంభమయ్యే ఈ బస్సు యాత్ర ఆగస్టు 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుండగా, ఆగస్టు 11 ఉదయం 10 గంటలకు చేర్యాల పట్టణానికి చేరుకోనుంది. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేర్యాల డివిజన్‌లోని కల్లుగీత కార్మికులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని బండకింది అరుణ్ కోరారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ మండల, పట్టణ నాయకులు ఆకుల కనకయ్య, అనగోని నర్సింహులు, కోల సత్తయ్య, పోతుగంటి లింగం, పచ్చిమడ్ల సిద్ధిరాములు, గుడాల గణేష్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, మల్లేశం, నర్సింలు, బుచ్చిరాములు, ప్రసాద్, భాస్కర్, బాలయ్య, భానుప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## కొమురవెల్లిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

-అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కాపాడాలి

-కాంగ్రెస్ శ్రేణులకు సూచనలు

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో జరుగుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమాన్ని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించి బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా కాంగ్రెస్ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలిస్తూ కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, మండల నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆకస్మిక తనిఖీలో కార్యక్రమం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పార్టీ నాయకులు నిరంతరం



ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, పార్టీ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

హిందుస్థాన్ మీడియా, రాజన్న సిరిసిల్ల:

మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు (పోక్సో) పాల్పడిన నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బి.వై.నగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు చైల్డ్ హెల్ప్‌లైన్--1098కు సమాచారం అందింది. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఫిర్యాదు మేరకు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి శ్రీకాంత్ విచారణ పూర్తి చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్6 ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు సిబ్బంది జనార్ధన్, నవీన్, వెన్నెల ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు, శాస్త్రీయ ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడి నేరం రుజువైనట్లు నిర్ధారించి 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, మైనర్లపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకోలేరని అన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కేసులో



సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి దర్యాప్తు అధికారి శ్రీకాంత్, ప్రస్తుత సీఐ శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుళ్లు జనార్ధన్, నవీన్, వెన్నెలలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలి: ఎస్పీ మహేష్ బి. గితే

-తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

హిందుస్థాన్ మీడియా, రాజన్న సిరిసిల్ల:

ప్రజల భద్రతకు6 అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు, ప్రజలకు అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తుల పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ విధులు, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. అలాగే ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడి ఫిర్యాదును అధికారులు బాధ్యతగా స్వీకరించి,



చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని



సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐలు ఉపేందర్ చారి, మల్లేష్తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నాగపురిలో ‘కనువిప్పు’ కార్యక్రమం

-చట్టాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్ఐ మహేష్

హిందుస్థాన్ మీడియా, కొమురవెల్లి:

కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగపురి గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ‘కనువిప్పు’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురవెల్లి ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న నేరాలు, సైబర్ మోసాలు, మూఢనమ్మకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూంచారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. అలాగే రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మహిళల భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ, శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎక్కడైనా డ్రగ్స్ విక్రయం లేదా సరఫరా జరుగుతున్నట్లు గమనిస్తే



వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సిద్ధిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని, గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువత సిద్ధిపేట పోలీస్ ఉద్యోగమిత్ర ఆన్‌లైన్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ మహేష్ సూచించారు.

# బిజినెస్

## ఇక ఇంటర్నెట్ లేకున్నా యూపీఐ చెల్లింపులు.. సిగ్నల్ లేని చోట కూడా సులభంగా పేమెంట్స్




**-ఆఫ్‌లైన్‌లో యూపీఐ చెల్లింపుల కోసం ఎన్‌పీసీఐ కొత్త ఫీచర్**
**-ఎన్ఎఫ్‌సీ టెక్నాలజీతో రూ.2,000 వరకు ట్యాప్ చేసి చెల్లించే సౌకర్యం**
**-ఇంటర్నెట్ లేని విమానాలు, మెట్రో రైళ్లలోనూ ఇక సులభంగా చెల్లింపులు**
**-యూజర్ ఫోన్, వ్యాపారి పీఓఎస్ మెషీన్ ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పటికీ అందుబాటులోకి ఈ సేవలు**

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో మరో విప్లవాత్మక మార్పు రాబోతోంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లోనూ సులభంగా యూపీఐ లావాదేవీలు జరిపేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఒక కొత్త ఫీచర్‌ను అభివృద్ధి చేస్తోంది. దీని ద్వారా యూజర్ ఫోన్, వ్యాపారి వద్ద ఉండే 'పాయింట్ ఆఫ్ సేల్' (పీఓఎస్) టెర్మినల్ రెండూ ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పటికీ, రూ. 2,000 వరకు చెల్లింపులు చేయవచ్చు. ఈ సదుపాయాన్ని నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్ఎఫ్‌సీ) టెక్నాలజీ ఆధారంగా 'ట్యాప్-టు-పే' విధానంలో తీసుకురానున్నారు. ఈ కొత్త ఫీచర్ పనితీరుపై అందుతున్న సమాచారం ప్రకారం వినియోగదారులు ముందుగా తమ ఫోన్‌లో ఇంటర్నెట్ ఉన్నప్పుడు 'ఆన్-డివైస్ యూపీఐ లైట్ వ్యాలెట్'లోకి డబ్బును లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత, ఇంటర్నెట్ సిగ్నల్ లేని ప్రదేశాల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, తమ ఎన్ఎఫ్‌సీ ఆధారిత స్మార్ట్‌ఫోన్‌ను వ్యాపారి వద్ద ఉన్న సర్టిఫైడ్ ఆఫ్‌లైన్ పీఓఎస్ టెర్మినల్‌పై ట్యాప్ చేస్తే చాలు. ఎలాంటి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే లావాదేవీ పూర్తవుతుంది. ఈ లావాదేవీ వివరాలను పీఓఎస్ టెర్మినల్ తనలో స్టోర్ చేసుకొని, తిరిగి ఇంటర్నెట్ కనెక్టివిటీ వచ్చిన వెంటనే సెటిల్‌మెంట్ కోసం పంపుతుంది.

**విమానాలు, మెట్రోల్లో నో టెన్షన్..**

ముఖ్యంగా విమానాలు, భూగర్భ మెట్రో స్టేషన్లు, మారుమూల గ్రామాలు వంటి నెట్‌వర్క్ సరిగా లేని లేదా అసలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈ ఫీచర్‌ను రూపొందిస్తున్నారు. దీనివల్ల ప్రయాణ సమయాల్లో, సిగ్నల్ సమస్యలు ఎదురయ్యే చోట్ల డిజిటల్ చెల్లింపుల విశ్వసనీయత, సౌలభ్యం గణనీయంగా పెరుగుతుంది. ఈ ఏడాది చివరి నాటికి ప్రముఖ తయారీదారుల నుంచి పీఓఎస్ టెర్మినల్స్‌కు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే ప్రక్రియను ఎన్‌పీసీఐ ప్రారంభించవచ్చని తెలుస్తోంది. ఆఫ్‌లైన్ చెల్లింపుల కోసం ఎన్‌పీసీఐ గతంలో చేసిన ప్రయత్నాలకు ఇది కొనసాగింపు. 2023లో ప్రవేశపెట్టిన 'యూపీఐ లైట్ ఎక్స్' ఫీచర్ ద్వారా ఎన్ఎఫ్‌సీ ఆధారిత క్యూఆర్ కోడ్‌లు లేదా సౌండ్‌బాక్స్‌ల సహాయంతో ఆఫ్‌లైన్‌లో ఒకరి నుంచి మరొకరికి (పీ2పీ), వ్యాపారులకు (పీ2ఎం) చెల్లింపులు చేసే అవకాశం కల్పించారు. ఇప్పుడు రాబోయే కొత్త ఫీచర్ ఈ సామర్థ్యాన్ని సాధారణ పీఓఎస్ టెర్మినల్స్‌కు కూడా విస్తరించనుంది. ఇప్పటికే పలు బ్యాంకులు, థర్డ్-పార్టీ యూపీఐ యాప్‌లు ఈ ఫీచర్‌ను తమ అప్లికేషన్లలో పొందుపరిచేందుకు సిద్ధమవుతున్నాయని ఫిన్‌టెక్ వర్గాలు పేర్కొంటున్నాయి. భారత్‌లో యూపీఐ లావాదేవీలు భారీ స్థాయిలో జరుగుతున్నాయి. ఒక్క జూన్ నెలలోనే 22.72 బిలియన్ల లావాదేవీల ద్వారా రూ. 28.92 లక్షల కోట్ల విలువైన చెల్లింపులు జరిగాయి. అయినప్పటికీ, కనెక్టివిటీ సమస్యలు దీని పూర్తిస్థాయి వినియోగానికి అడ్డంకిగా ఉన్నాయి. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఆఫ్‌లైన్ డిజిటల్ చెల్లింపుల పరిమితి ఒక లావాదేవీకి రూ. 500 కాగా, యూపీఐ లైట్ ఎక్స్ పరిమితి కూడా రూ. 500 గానే ఉంది. అయితే, కొత్తగా రాబోయే ఈ పీఓఎస్ ఆఫ్‌లైన్ ఫీచర్ కోసం లావాదేవీ పరిమితిని రూ. 2,000కు పెంచడం ఒక ముఖ్యమైన ముందడుగు. ఇది ప్రయాణికుల చిన్న చిన్న ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతుంది. దీనికి సంబంధించిన అధికారిక మార్గదర్శకాలను ఎన్‌పీసీఐ త్వరలో విడుదల చేయనుంది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, సిగ్నల్ లేదనే కారణంతో విఫలమయ్యే లావాదేవీలు తగ్గి, కోట్లాది మంది వినియోగదారులకు డిజిటల్ చెల్లింపులపై మరింత భరోసా కలుగుతుంది.

# క్రీడలు

## రోహిత్ మాటలు అప్పట్లో నమ్మలేదు.. ప్రపంచకప్‌లో అదే నన్ను మార్చింది: సంజూ శాంసన్



**-టీ20 ప్రపంచకప్ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న సంజూ**
**-ఆరంభ మ్యాచుల్లో ఎంపిక చేయకపోవడంతో నిరాశకు గురైనట్లు వెల్లడి**
**-రోహిత్ ధైర్యం చెప్పినా నమ్మలేకపోయానన్న శాంసన్**
**-క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నట్లు వెల్లడి**
**-అదే తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్న సంజూ**

టీ20 ప్రపంచకప్-2026లో తొలుత తుది జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని భారత వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విఫలమైన తర్వాత ఇషాన్ కిషన్ అద్భుతంగా రాణించడంతో తన ప్రపంచకప్ అవకాశాలు ముగిసిపోయాయని భావించి నట్లు చెప్పాడు. ఆ సమయంలో రోహిత్ శర్మ ధైర్యం చెప్పినా తాను ఆ మాటలను నమ్మలేకపోయానని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు. ప్రపంచకప్ ప్రారంభమైన తొలి నాలుగు, ఐదు రోజులు ఆ నిరాశ నుంచి బయటపడలేకపోయానని సంజూ చెప్పాడు. ఆ తర్వాత తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని.. అసలు తాను క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నానని వివరించాడు. అదే తనలో మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, మానసికంగా బలంగా మారేందుకు దోహదపడిందని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు ముందు మరింత మెరుగ్గా సిద్ధమయ్యానని సంజూ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో ప్రతి షాట్ సహజంగానే వచ్చిందని, అది తన కెరీర్‌లో ప్రత్యేకమైన ఇన్నింగ్స్‌గా నిలిచిపోతుందని అన్నాడు. వికెట్లు పడుతుండటంతో సాధారణ ఆటతీరును మార్చుకుని పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేశానని వివరించాడు. ఇక న్యూజిలాండ్ సిరీస్ తన కు పెద్ద గుణపాఠం నేర్పిందని సంజూ చెప్పాడు. ఎక్కువసేపు ప్రాక్టీస్ చేయడం కంటే మానసికంగా ప్రశాంతంగా ఉండటమే ముఖ్యమని తన భార్య చెప్పిన మాటలు అప్పుడే అర్థమయ్యాయని పేర్కొన్నా డు. తాను సాధించిన విజయాల్లో దేవుడి ఆశీర్వాదమే ఎక్కువని, ఆ ప్రపంచకప్ ఇన్నింగ్స్ జీవితాంతం గుర్తు ండిపోతుందని సంజూ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.

## 2027 వన్డే వరల్డ్‌కప్‌కు రవిశాస్త్రి డ్రీమ్ టీమ్ ఇదే!

**-దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఉమ్మడి వేదికలుగా 2027 ప్రపంచకప్**
**-సీనియర్లు, జూనియర్ల కాంబినేషన్ తో జట్టును ఎంపిక చేసిన రవిశాస్త్రి**
**-రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు చోటు**



2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు ఇంకా సమయం ఉన్నప్పటికీ, టీమిండియా స్క్వాడ్‌పై ముందస్తు చర్చలు ఊపందుకున్నాయి. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఉమ్మడి వేదికలుగా జరగనున్న ఈ మెగా టోర్నీ కోసం టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తన 15 మంది సభ్యుల డ్రీమ్ టీమ్ ను ప్రకటించారు. సీనియర్ల అనుభవం, యువకుల ఆవేశాన్ని సమతుల్యం చేస్తూ ఈ జట్టును రూపొందించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల వన్డే భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వస్తున్నప్పటికీ... 2027 వరల్డ్‌కప్‌లో వీరిద్దరు భారత్‌కు అత్యంత కీలకమని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. ఐసీసీ మెగా టోర్నీల్లో వీరి అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇక శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను కూడా జట్టులోకి తీసుకున్నారు. రవిశాస్త్రి ఎంచుకున్న పేస్ దళంలో జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీలతో పాటు సీనియర్ స్వింగ్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు చోటు దక్కడం విశేషం. సౌతాఫ్రికాలోని సీమ్, బౌన్స్ పిచ్‌లపై ఈ అనుభవజ్ఞులైన పేసర్లు ప్రత్యర్థులను దెబ్బతీయగలరని రవిశాస్త్రి పేర్కొన్నారు. అయితే, మరోవైపు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా వంటి యువ పేసర్లను ప్రోత్సహిస్తున్నారు. రవిశాస్త్రి ఎంపిక చేసిన 2027 వన్డే వరల్డ్‌కప్ టీమిండియా జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్.

## గంభీర్ కూడా బాధ్యత తీసుకోవాల్సిందే.. టీమిండియా ఓటమిపై మాజీ కెప్టెన్ ఫైర్

**-గంభీర్‌పై మాజీ కెప్టెన్ శ్రీకాంత్ విమర్శలు**
**-టీమ్ మేనేజ్‌మెంట్ బాధ్యత వహించాలని డిమాండ్**
**-వరుస మార్పులతో ప్రపంచకప్‌కు సిద్ధం కాలేమని వ్యాఖ్య**
**-కేఎల్ రాహుల్ బ్యాటింగ్ స్థానంపై అసంతృప్తి**
**-బలమైన జట్లపై విజయాలే అసలు ప్రమాణమన్న మాజీ కెప్టెన్**



ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఓటమి తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, జట్టు యాజమాన్యంపై మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర విమర్శలు చేశారు. వరుసగా జట్టులో మార్పులు చేయడం, సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఇలాంటి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. 2027 ప్రపంచకప్‌కు ఇలాగే సిద్ధమైతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో కోల్పోయిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో స్పందించారు. జింబాబ్వే, శ్రీలంక, వెస్టిండీస్‌లాంటి జట్లపై విజయాలు సాధిస్తేనే భారత జట్టు మళ్లీ ఫామ్‌లోకి వచ్చిందని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. బలమైన జట్లపై గెలిచినప్పుడే అసలు ప్రమాణం తెలుస్తుందని పేర్కొన్నారు. టీమ్ మేనేజ్‌మెంట్‌తో పాటు గంభీర్ కూడా ఈ ఫలితాలకు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. వన్డే ప్రపంచకప్‌కు ముందు చాలా తక్కువ మ్యాచ్‌లు మాత్రమే ఉండటంతో ఇప్పుడైనా స్థిరమైన జట్టును తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లార్డ్స్ వన్డేలో బ్యాటింగ్ ఆర్డర్‌పైనా శ్రీకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే సమయంలో కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపడం అర్థంలేని నిర్ణయమన్నారు. రోహిత్ శర్మ ఔటైన వెంటనే విరాట్ కోహ్లీకి తోడుగా రాహుల్‌ను పంపాల్సిందని అభిప్రాయపడ్డారు. 2023 ప్రపంచకప్‌లో కోహ్లీతో కలిసి రాహుల్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన విషయాన్ని గుర్తు చేశారు. మ్యాచ్ దాదాపు చేజారిపోయిన తర్వాత అతణ్ని క్రీజులోకి పంపడం వల్ల ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు.

## ఐశ్వర్యలో ఆ అణకువే నచ్చుతుంది
## జయా బచ్చన్ పాత వ్యాఖ్యలు వైరల్

బాలీవుడ్ నటి, మాజీ విశ్వసుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్‌పై ఆమె అత్త, సీనియర్ నటి జయా బచ్చన్ గతంలో కురిపించిన ప్రశంసలు మరోసారి వార్తల్లో నిలిచాయి. తన కోడలు ఐశ్వర్య తమ కుటుంబంలో ఎంత అన్యోన్యంగా కలిసిపోయారో, అంతటి స్టార్‌డమ్ ఉన్నప్పటికీ ఆమె ఎంతటి అణకువతో ఉంటారో జయా బచ్చన్ ఒక సందర్భంలో వివరించారు. దీనికి సంబంధించిన పాత వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కరణ్ జోహార్ నిర్వహించే ప్రముఖ చాట్ షో 'కాఫీ విత్ కరణ్'లో పాల్గొన్న సందర్భంగా జయా బచ్చన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఐశ్వర్య చాలా మంచి మనసున్న వ్యక్తి. ఆమెకు నా పట్ల ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయి. తను కూడా పెద్ద స్టార్ అయినప్పటికీ, మేమంతా కలిసి ఉన్నప్పుడు ఎప్పుడూ తన హోదాను ప్రదర్శించుకోదు. ఎంతో హుందాగా ఉంటూ, ఇతరుల మాటలను నిశ్శబ్దంగా వింటుంది. ఆమెలోని ఈ గుణం నాకు ఎంతగానో నచ్చుతుంది," అని జయ కొనియాడారు. కేవలం కుటుంబ సభ్యులతోనే కాకుండా, తమ స్నేహితులతో కూడా ఐశ్వర్య ఎంతో సాన్నిహిత్యంగా మెలుగుతారని జయ ఆనందం వ్యక్తం చేశారు. ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల వివాహం 2007 ఏప్రిల్ 20న జరిగిన విషయం తెలిసిందే. వీరికి 2011లో ఆరాధ్య అనే కుమార్తె జన్మించింది. 'కుచ్ నా కహో', 'ధూమ్ 2', 'గురు', 'రావణ్' వంటి పలు చిత్రాల్లో అభిషేక్, ఐశ్వర్య కలిసి నటించారు.



## చరణ్ సరసన రష్మిక?- సుకుమార్ స్కెచ్ మామూలుగా లేదుగా!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం 'ఆర్‌సీ17' (వర్కింగ్ టైటిల్)పై సినీ వర్గాల్లో అంచ నాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం, ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' ఫ్రాంచైజీ సినిమాలు చరిత్ర సృష్టించడం నేపథ్యంలో... ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమాని త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మొదట కియారా అద్వానీ పేరు వినిపించినా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న పేరు బలంగా వినిపిస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పుష్ప' సిరీస్‌తో రష్మిక పాన్-ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఆ చిత్రంలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు 'ఆర్‌సీ17' కోసం సుకుమార్ ఒక బలమైన, కథను మలుపు తిప్పే మహిళా పాత్రను రాసుకున్నారని, ఆ పాత్రకు రష్మిక అయితేనే పూర్తి న్యాయం చేయగలదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఆమెకున్న పాన్-ఇండియా ఇమేజ్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథాగమనంలో అత్యంత కీలకంగా ఉండనుందని తెలుస్తోంది.చరణ్ మాస్ ఇమేజ్, సుకుమార్ టేకింగ్, దానికి రష్మిక నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 'రంగస్థలం'తో రికార్డులు సృష్టించిన ఈ కాంబో, మరోసారి అంతకుమించిన విజయాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, హీరోయిన్ ఎంపికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.మరోవైపు రష్మిక ప్రస్తుతం తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' అనే భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 19వ శతాబ్దంలో రాయలసీమలో కరవు సమయంలో బ్రిటిష్ పాలనపై పోరాడిన ఓ యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.



## 'టాక్సిక్' నుంచి రెండో పాట
## యశ్-తారా రొమాన్స్‌తో 'మనసు ఆగదు'!




రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం రెండో పాట 'మనసు ఆగదే'ను విడుదల చేసింది. ఇప్పటికే వచ్చిన తొలి పాట 'తబాహి'తో బోల్డ్ రొమాంటిక్ టోన్‌ను చూపించిన మేకర్స్.. ఇప్పుడు రెండో పాటలో అంతకుమించిన రొమాన్స్‌ను ఆవిష్కరించారు. ఈ పాటలో యశ్, బాలీవుడ్ నటి తారా సుతారియా మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాత్‌టబ్‌లో తారా ఎంట్రీ, ఆమెకు యశ్ గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్, వర్షంలో ఇద్దరి రొమాంటిక్ మూమెంట్స్, కేఫ్‌లో ముద్దులతో సాగే సన్నివేశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రెండో పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.









Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455